30CTR1:30CTR1.qxd 9/29/2026 11:22 PM Page 1



తిరుపతి - చిత్తూరు

30 ఏళ్ల ప్రస్థానం వార్త వార్షికోత్సవం 1996 - 2026

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## శ్రీవారి తోమాలసేవలో మంత్రి లోకేశ్

### -సింగపూర్ మంత్రి షణ్ముగం

తిరుమల, సెప్టెంబర్ 29ప్రభాతవార్తప్రతినిధి:



శ్రీవారిని మంగళవారం వేకువజామున సింగపూర్ మంత్రి షణ్ముగం, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ వేకువజామున సుప్రభాతం, తోమాల, అర్చనసేవల్లో పాల్గొని దర్శించు కున్నారు. ఇరువురికీ ఆలయ మర్యాదలతో టిటిడి ఈఓ రవిచంద్ర, అదనపు ఈఓ వెంకయ్యచౌదరి స్వాగతం పలికారు. శ్రీవారి సేవల్లో పాల్గొని దర్శనం చేసుకున్నారు. సింగపూర్ మంత్రి కె. షణ్ముగంకు, మంత్రి నారా లోకేష్‌కు తీర్థప్రసాదాలు అందజేశారు. టిటిడి బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, సి.దివాకర్‌రెడ్డి, ఎస్‌విబిసి ఛైర్మన్ బి.శ్రీధర్‌వర్మ ఉన్నారు.

### భూమనను కట్టడి చేసేలా

## కూటమి మేయర్ అభ్యర్థి !

### -లోకేశ్ పర్యటనలో కీలక సంకేతాలు!!



ప్రభాతవార్త–తిరుపతి:

తిరుపతి కార్పొరేషన్ మేయర్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఎంపికకు సామాజిక సమీకరణాలతో బాటు ప్రత్యర్థి పార్టీ వ్యూహాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని టిడిపి అధిష్ఠానం భావిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా వైసిపి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కొనే సామర్థ్యం ఉన్న అభ్యర్థికే ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచన ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మంత్రి నారా లోకేశ్ అనంతరం తిరుపతిలోని తాజ్ హోటల్‌కు చేరుకున్నారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు అక్కడ ఉన్న ఆయనను ఎమ్మెల్యేలు, పలువురు పార్టీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా కొందరు నాయకులు నామినేటెడ్ పదవులు, పార్టీ పదవులపై తమ అభ్యర్థనలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి ప్రాధాన్యం ఇస్తామని, పార్టీ నాయకులు, కార్యకర్తల వివరాలు తన వద్ద ఉన్నాయని లోకేశ్ వారికి మొహంపై చెప్పినట్లు సమాచారం. ఇదే సమయంలో మేయర్ టికెట్ ఆశిస్తున్న ఒక నేతకు కనీసం ఫొటో దిగే అవకాశం కూడా లభిం చలేదని, "చాలు పదండి" అంటూ లోకేశ్ అసహనం వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాల సమా చారం. తిరుపతి మేయర్ అభ్యర్థి ఎంపిక విషయంలో వైసిపి ఎవరిని రంగంలోకి దింపు తుం దన్న అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని పార్టీ అధిష్ఠానం భావిస్తున్నట్లు సమా చారం. భూమన కుటుంబానికి రాజకీయంగా దీటుగా నిలబడగల సామర్థ్యం, స్థానికంగా ఉన్న పరిచయాలు, సామాజిక సమీకరణాలు, కూటమి ఓట్లను ఏకతాటిపైకి తీసుకురాగల సామర్థ్యం వంటి అంశాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మేయర్ పదవి బిసిలకు రిజర్వు అయితే సమీకరణాలు మరో విధంగా ఉండే అవకాశం ఉంది. అప్పుడు మాజీ మేయర్ డాక్టర్ శిరీష యాదవ్‌ను వైసిపి బరిలోకి దించే అవకాశాలుంటే, అదే సామాజిక వర్గానికి చెందిన యువ నేతను కూటమి అభ్యర్థిగా ఎంపిక చేసే అంశాన్ని పరిశీలించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**జనరల్ అయితే సమీకరణాలు మార్పు:**

మేయర్ స్థానం జనరల్ కేటగిరీకి వస్తే పోటీ మరింత ఆసక్తికరంగా మారే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. కూటమి ఓట్లను ప్రభావితం చేసే విధంగా వైసిపి బలిజ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని రంగంలోకి దించే అవకాశం ఉంటే, దానికి ప్రతిస్పం దనగా బలమైన రాజకీయ నేపథ్యం ఉన్న అభ్యర్థిని ఎంపిక చేయాలనే ఆలోచన అధిష్ఠానం లో ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో "ముల్లును ముల్లుతోనే తీయాలి" అన్న రాజకీయ వ్యూహంతో ప్రత్యర్థి సామాజిక సమీకరణాలకు దీటైన అభ్యర్థిని ఎంపిక చేయాలనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఆశావహుల పేర్లను పార్టీ వర్గాలు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే యాదవ, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కొన్ని పేర్లు టిడిపి పరిశీలనలో ఉన్నట్టు తెలిసింది. అయితే తుది నిర్ణయం మాత్రం ఎన్నికల రిజ ర్వేషన్, వైసిపి అభ్యర్థి ఎంపిక, కూటమిలోని మూడు పార్టీల సమన్వయం, స్థానిక రాజకీయ బలాబలాలు వంటి అంశాలపై ఆధారపడి ఉండే అవకాశం ఉంది.

**మేయర్ టికెట్ కోసం పలువురు ఆశావహులు**

కాగా తిరుపతి మేయర్ టికెట్ కోసం పలువురు ఆశావహులు ప్రయత్నాలు కొనసాగిస్తున్న నేపథ్యంలో, ప్రత్యర్థిని బట్టి అభ్యర్థిని ఎంపిక చేసే లోకేశ్ వ్యూహం ఎటువైపు దారితీస్తుందన్నది ఇప్పుడు తిరుపతి రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.



## ఘోరప్రమాదం

- భారీ క్రేన్ జారిపడి ముగ్గురు మృతి - - మరో ఇద్దరికీ తీవ్ర గాయాలు
- డాక్టర్ ఎస్. ఆర్. కే మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల ప్రాంగణంలో దుర్ఘటన
- ఘటన సమయానికి విద్యార్థులు లేకపోవడంతో తప్పిన పెనుముప్పు
- తక్షణ చర్యలు చేపట్టిన ఈస్ట్ సిఐ శ్రీనివాసులు

తిరుపతి క్రైం, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

హోటల్ భవన నిర్మాణం పనులలో భాగంగా సుమారు 30 అడుగుల ఎత్తు నుండి భారీ క్రేన్ సహాయంతో చెట్టును పెక్కలించడానికి ప్రయత్నిస్తూ అదుపుతప్పి బోల్తా పడటంతో అక్కడే పని చేస్తున్నటు వంటి కార్మికుల పై పడి ముగ్గురు మృతిచెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలవగా ఒకరికి స్వల్ప గాయం అయిన ఘటన తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొర్లగుంటలో చోటుచేసుకుంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు సమాచారం మేరకు శ్రీ కన్వెన్షన్ వారి స్థలంలో హిల్టన్ కంపెనీ స్టార్ హోటల్ నిర్మాణంలో భాగంగా శ్రీ కన్వెన్షన్ వారి పర్యవేక్షణలో నిర్మాణ పనులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మధ్యాహ్నం తమ సైట్‌లోని వృక్షాన్ని పెక్కలించడానికి భారీ క్రేన్ ధ్వారా ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా తమ వర్క్ సైట్ నుండి చెట్టును పెకలించడానికి భారీ క్రేనును డాక్టర్ ఎస్.ఆర్.కే మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల ప్రాంగణంలోకి వెళ్లి అక్కడి నుండి సుమారు 30 నుండి 40 అడుగుల లోతులోకి క్రేన్ యొక్క తొలగింపు భాగాన్ని క్రిందకు వంచి తొలగించే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో క్రేన్ యొక్క సపోర్ట్ పిల్లర్స్ పాఠశాల ప్రాంగణంలో లోతట్టు ప్రాంతానికి సమీపానే ఉంచి ప్రయత్నించారు. పక్కనే హోటల్ సైటు నిర్మాణం కోసం భారీగా తవ్వి ఉండడంతో క్రేన్ సపోర్ట్ పిల్లరర్స్ నెలపై భారాన్ని మోయలేక లోతట్టు ప్రాంతం వైపు భూమి కృంగిపోయింది. ఈ అనుకుని పరిణామంతో క్రేన్ ఒక్కసారిగా బోల్తా పడింది. క్రేన్ అవతల వైపు మొక్క తొలగింపు ప్రక్రియని పర్యవేక్షిస్తున్న వర్క్ సైట్ ఇంజనీర్, వలస కూలీలు స్థానిక కార్మికులు ప్రమాద బారిన పడ్డారు. ఇందులో ఒరిస్సాకు చెందిన వలస కూలి రామారావు (45), శ్రీకాళహస్తికి చెందిన సైట్ ఇంజనీర్ సందీప్ (35), తిరుపతి చెందిన వాచ్ మెన్ జంగయ్య



(40) మృతి చెందారు. అదే క్రమంలో బీహార్ రాష్ట్రానికి చెందిన షేక్ ఫరహాన్, నౌషాన్ క్రేన్ ఆపరేటర్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఏర్పేడు మండలం ఆర్ మల్లవరంకు చెందిన కూలీ మురగయ్య స్వల్ప గాయంతో బయటపడ్డాడు. గాయపడిన వారిని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతులను పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు.

**డాక్టర్ ఎస్ ఆర్‌కె మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల విద్యార్థులకు తప్పిన ముప్పు**

ఈ ఘటన డాక్టర్ ఎస్ ఆర్ కె తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల ప్రాంగణంలో మధ్యాహ్నం సుమారు 12 గంటల ప్రాంతంలో ప్రమాదం చోటుచేసుకుంది. నిత్యం విద్యార్థులు వారి తల్లిదండ్రులు రద్దీగా ఉండే పాఠశాల ప్రాంగణంలోపు ఇంత పెద్ద భారీ క్రేన్‌ను ఎవరిలోనికి అనుమతించారని పలువురు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హోటల్ నిర్మాణ కాంట్రాక్టర్ పాఠశాల సంబంధిత





ప్రధానోపాధ్యాయులు కానీ మరి ఇతర ఉన్నతాధికారుల వద్ద అను మతులు తీసుకున్నారా లేదా అనే విషయం తెలియాల్సి ఉంది. ప్రమాద ఘటన జరి గిన వెంటనే ఘటనా స్థలానికి హుటా హుటిన చేరుకున్న తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, మూడు క్రేన్లు ఒక జెసిబి సహాయంతో బోర్లా పడిన భారీ క్రేన్‌ను పైకి లేపి గాయపడిన వారిని మృతి చెందిన వారిని స్థానికలు సహాయంతో స్వయంగా తానే వాహనం కింద నుండి బయటకు తీసుకొచ్చారు. అనంతరం గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. పాఠశాల ప్రాంగణంలో ఈ ఘటన జరగడంతో మృతులను, గాయపడినవారిని తరలించిన అనంతరం కూడా పాఠశాల సమయం ముగిసే వరకు వేచి వున్నారు. పాఠశాల ముగిశాక వందలాదిక వచ్చిన విద్యార్థులు ఉత్సాహంతో ప్రమాదం జరిగిన క్రేన్ మరియు లోతట్టు ప్రాంతాలలో వీక్షిస్తూ ప్రమాదం బారిన పడే అవకాశం ఉన్నం దున ఘటన ప్రాంతం నుండి దూరంగా వెళ్లేలా క్రమ పద్ధతిలో విద్యా ర్థులను ప్రాంగణం విలువలకు సురక్షితంగా పంపించారు. గాయపడిన వారిని వెలుపలికి తీసుకురావడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించిన సిఐ శ్రీనివాసులు స్థానికులు అభినందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

## గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా రాయలసీమ అభివృద్ధి

- మూడేళ్లలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు ప్రభుత్వం నుంచి రూ.40 వేల కోట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

.తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :

రాయలసీమ ప్రాంతాన్ని దేశంలోనే ప్రముఖ "గ్లోబల్ హార్టికల్చర్ హబ్"గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "గ్లోబల్ హార్టికల్చర్ హబ్ – రాయలసీమ రైజింగ్" కార్యక్రమం ద్వారా వచ్చే మూడు సంవత్సరాల్లో సుమారు రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం తిరుపతి కలెక్టరేట్ లోని విసి హాల్ నందు జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి జయభరత్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సమగ్ర మార్గదర్శకాలు, కార్యాచరణ ప్రణాళికను రూపొందించిందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,



ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ రాయలసీమలో ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి అక్టోబర్ 2న మదనపల్లె వేదికగా కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ఉప ముఖ్యమంత్రులతో కలిసి లాంఛనంగా ప్రారంభించనున్నారని తెలిపారు. "గ్లోబల్ హార్టికల్చర్ హబ్ – రాయలసీమ రైజింగ్" కార్యక్రమం కింద రాయలసీమలోని ప్రస్తుత 8 జిల్లాలతో పాటు ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలను కలుపుకొని మొత్తం 10 జిల్లాల్లో వచ్చే మూడు సంవత్సరాల్లో సుమారు రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో సుమారు రూ.40 వేల కోట్లు ప్రభుత్వ పెట్టుబడులుగా, మరో రూ.60 వేల కోట్లను ప్రైవేట్ పెట్టుబడులుగా సమీకరించనున్నట్లు చెప్పారు. ఇందులో ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా రూ.14,906 కోట్లు, నీటిపారుదల శాఖ ద్వారా రూ.20,884 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.4,562 కోట్లకు పైగా కేటాయింపులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. అనంతపురం, శ్రీ సత్యసాయి, చిత్తూరు, తిరుపతి ప్రాంతాలకు బెంగళూరు, ప్రకాశం, మార్కాపురం, తిరుపతి, కడప ప్రాంతాలకు చెన్నై నగరాలు సమీపంలో ఉండటం ఉద్యాన పంటల మార్కెటింగ్‌కు అనుకూలమైన అంశమని తెలిపారు.

### యాళివాహనంపై

## గణనాధుని రాజసం



కాణిపాకం, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:

కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి సిద్ధి, బుద్ధి సమేతుడైన గణనాధుడు యాళివాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయహస్తమందించారు. ఈకార్యక్రమానికి ఎ.నరసింహారెడ్డి అండ్ సన్స్, అగరంపల్లె, పి.సుబ్బారెడ్డి అండ్ సన్స్, చినకాంపల్లె, లక్ష్మాంబపురం, దేవస్థానం వారు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు వారు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా అర్చకస్వాములు స్వామివారి మూలవిరాట్‌కు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి దేదీప్యమానంగా అలంకరించి ప్రత్యేకపూజలతో ధూప, దీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే రాత్రి గణనాధుడు ఉభయదేవేరులతో కలసి వేదపం డితులు మం త్రోచ్చరణ నడుమ అర్చక స్వాముల పూజలందుకున్న అనంతరం రంగు రంగుల విద్యుద్దీపాలు, వివిధరకాల పరిమళ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించిన యాళివాహనంపై అధిరోహించి భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, స్థానాచార్యులు పణిస్వామి, ఏఈఓలు రవీంద్రబాబు, ధనపాల్, ఆలయ సూపరెండెంట్‌లు వాసు, కోడండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, రవిలతో పాటు ఉత్సవ ఉభయదారులు పాల్గొన్నారు.

## శ్రీ గురుదేవులు (శ్రీ భగవాన్) మహాసమాధి

- రేపు భక్తుల దర్శనార్థం ఏకం క్షేత్రంలో భౌతిక దేహం
- దివ్య సన్నిధిని కోల్పోయిన భక్తుల్లో విషాదం

వరదయ్యపాలెం, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త



ఆధ్యాత్మిక మార్గదర్శకులు, భక్తుల ఆరాధ్య శ్రీ గురుదేవులు మహాసమాధి పొందారు. ఆయన మహాసమాధి వార్తతో భక్తులు, శిష్యులు తీవ్ర విషాదానికి లోనయ్యారు. ఆధ్యాత్మిక సాధన, మానవతా విలువలు, సేవా భావం, ఆత్మజ్ఞాన సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన శ్రీ గురుదేవుల బోధనలు భక్తుల జీవితాల్లో చెరగని ముద్ర వేశాయి. ఆయన భౌతిక దేహాన్ని విడిచినా, అందించిన ఆధ్యాత్మిక సందేశాలు, బోధనలు భక్తుల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతాయని భక్తులు పేర్కొంటున్నారు. భక్తుల దర్శనార్థం శ్రీ గురుదేవుల భౌతిక దేహాన్ని రేపు వరదయ్యపాలెం మండలంలోని బత్తలవల్లం ప్రాంతంలోని ఏకం క్షేత్రంలో ఉంచనున్నట్లు సమాచారం. దీంతో గురుదేవుల చివరి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నట్లు తెలుస్తోంది. శ్రీ గురుదేవుల భౌతిక సన్నిధి ఇక మన మధ్య లేకపోయినా ఆయన దివ్య సందేశం, ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం ఎప్పటికీ కొనసాగుతాయి అని భక్తులు భావోద్వేగంతో స్మరించుకుంటున్నారు. గురుదేవులు తమ దివ్య ప్రయాణాన్ని కొనసాగించిన సందర్భంగా భక్తులు, శిష్యులు ఘన నివాళులు అర్పిస్తూ, ఆయన ఆధ్యాత్మిక సేవలను స్మరించుకుంటున్నారు.

## సామవేదంపై జాతీయ సదస్సు

### వేద వర్శిటీ లో మందికిపైగా పండితుల పత్ర సమర్పణలు



తిరుపతి విద్య, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

సామవేద సాహిత్య ప్రాశస్త్యం, దాని వైశ్విక ప్రాసంగికతపై శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో రెండు రోజుల జాతీయ సదస్సు మంగళవారం ప్రారంభమైంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 50 మందికిపైగా పండితులు, పరిశోధకులు పాల్గొని బుధవారం మధ్యాహ్నం వరకు పరిశోధనా పత్రాలను సమర్పించనున్నారు. సామవేదీయ వాఙ్మయస్య వైశ్విక ప్రాసంగికతా అంశంపై వర్సిటీ సామవేద విభాగం ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు ప్రొఫెసర్ ఉమేష్ ప్రసాద్ దాశ్ అధ్యక్షత వహించారు. టీటీడీ విశ్రాంత వేదపారాయణదారు మహామహోపాధ్యాయ గణేశన్ శ్రౌతి సారస్వత అతిథిగా పాల్గొన్నారు. సమన్వయకర్త డాక్టర్ గిరిజాప్రసాద్ షడంగి సదస్సు లక్ష్యాలను వివరించారు. మరోవైపు వైఖానస ఆగమ విభాగం ఆధ్వర్యంలో శ్రీమాన్ రొంపిచర్ల భట్టర్ పార్థసారథి కృష్ణమాచార్యుల 131వ జయంత్యుత్సవాన్ని నిర్వహించారు. రిజిస్ట్రార్ డాక్టర్ బలభద్ర ఉపాధ్యాయ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీటీడీ ఆగమ సలహాదారు డాక్టర్ పి.కె. వరదన్ భట్టాచార్యకు పార్థసారథి భట్టాచార్య పురస్కారం అందజేశారు.

### నేటి నుండి

## పోలేరమ్మ జాతర

బాలాయపల్లి, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త



దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి గ్రామ శక్తి స్వరూపిణి పోలేరమ్మ అమ్మవారి జాతర కుల మతాలకు అతీతంగా జరుగుతుంది. పోలేరమ్మ అమ్మవారిని అమ్మవారి ఇల్లుగా పిలవబడే చాకలి వీధిలో ఈనెల 30వ తేదీ మట్టితో తయారు చేస్తారు. అమ్మవారికి ఇక్కడ కళ్ళను పెట్టరు. చాకలి వీధి నుండి అమ్మవారిని అత్తవారి ఇల్లుగా పిలవబడే జీనుగుల వారి వీధిలోని అలంకార మండపంకు తీసుకొని వెళతారు. ఇక్కడ అమ్మవారికి కళ్ళు పెట్టి, బంగారు నగలతో అలంకరిస్తారు. అమ్మవారిని జీనుగుల వారి వీధి నుండి రథంపై లక్షలాది మంది భక్తుల నడుమ బజారు వీధిలోని గుడి వద్ద భక్తుల దర్శనార్థం ఉంచుతారు. అక్టోబర్ నెల ఒకటో తేదీ వరకు అమ్మవారిని దర్శించుకున్న అనంతరం పోలేరమ్మ అమ్మవారి నీ భక్తులు దర్శించుకుని అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు లక్షల మంది భక్తులు దర్శించుకుంటారు.

## నారాయణ పాఠశాల హాస్టల్ విద్యార్థి నిద్రలోనే మృతి

తిరుపతి రూరల్, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త



తిరుపతి రూరల్ మండలం శ్రీనివాస మంగాపురం నారాయణ పాఠశాల హాస్టల్‌లో పదవ తరగతి చదువుతున్న మిథున్ రెడ్డి అనే విద్యార్థి నిద్రలోనే అనుమానా స్పదంగా మృతి చెందినట్లు తిరుపతి రూరల్ సిఐ మద్దయ్య చారి తెలిపారు. ఆ మేరకు... అన్నమయ్య జిల్లా కెవిపల్లి మండలం బోడిరెడ్డిగారిపల్లె గ్రామానికి చెందిన చక్రధర్ రెడ్డి కుమారుడు మిథున్ రెడ్డి, నారాయణ పాఠశాల హాస్టల్‌లో ఉంటూ పదవ తరగతి చదువుతున్నాడు. సోమవారం రాత్రి 10:30 గంటలకు పడుకున్న విద్యార్థి, ఉదయం 5:00 గంటలకు స్టడీ క్లాస్‌కు హాజరు కాలేదు. దీంతో హాస్టల్ వార్డెన్ వెళ్లి పరిశీలించగా విద్యార్థి స్పందించకపోవడంతో వెంటనే ఉదయం 6 గంటల ప్రాంతంలో ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు విద్యార్థి అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. ప్రాథమిక దర్యాప్తు మేరకు విద్యార్థి మృతి సహజ మరణం గానే ఉందని, అయితే మృతికి గల కారణాలు తెలియనందున అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ చెప్పారు. పోస్ట్‌మార్టం నివేదిక వచ్చిన తర్వాతే మృతికి గల పూర్తి కారణాలు తెలుస్తాయని సీఐ వెల్లడించారు.

## కట్టుకున్న మొగుడినే కడతేర్చే కుట్ర

### కసాయి పెళ్ళాంతో పాటు 5 మంది అరెస్ట్

చంద్రగిరి, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:

ప్రేమించి తాళికట్టిన మొగుడినే కడతేర్చేందుకు ఓ కసాయి పెళ్ళాం చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో 6 మంది కటకటాల పాలైన సంఘటన మంగళవారం చంద్రగిరిలో చోటు చేసుకున్నది. బిజెపి మండల అధ్యక్షుడు కాకిమాను మునిరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు స్పందించారు. దాదాపు 15 రోజుల క్రితం మునిరాజు ఇంటిముందు గల తన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టారని చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్థానికుల వివరాల మేరకు.. మునిరాజు భార్య కె.ప్రశాంతి ఇరువురు ప్రేమించుకుని కులాంతర వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం వున్నారు. మునిరాజు ఆర్థికంగా ఎదుగుతూనే బిజెపిలో చేరి మండల అధ్యక్షుడుగా నియమించబడ్డారు. అయితే కుటుంబంలో ఇద్దరి మధ్యన విభేధాలు ప్రారంభమై తరచూ గొడవలు పడే స్థాయికి చేరుకున్నాయి. ఇదిలావుండగా తన భార్య గురించి ఎప్పుడూ గొప్పగా చెప్పుకునే మునిరాజు తన ద్విచక్ర వాహనం తగలబెట్టడంపై కేసు పెట్టడంతో దిమ్మతిగే వాస్తవాలు వెలుగు చూశాయి. పాత శానంబట్లకు చెందిన (చంద్రగిరిలో నివాసం వుంటున్న) ఆర్.పృధ్వీరాజ్ అలియాస్ బట్టు యాదవ్ (27), చంద్రగిరి కొత్తపేటకు చెందిన ఎస్.యువసాయి (26), చంద్రగిరి ఇందిరమ్మ కాలనీకి చెందిన పి.ఉదయ్‌కిరణ్ (21), రాయలపురం పంచాయతీ, వెంకటంపేటకు చెందిన డి.సి.లీలాకృష్ణ అలియాస్ ముత్యాలు (24), చంద్రగిరి కొత్తపేటకు చెందిన కె.హరీష్‌లను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ విచారణలో ఫిర్యాదుదారుడైన మునిరాజు భార్య కె.ప్రశాంతి చెప్పడంతో మునిరాజు హత్య చేసేందుకు పలుమార్లు ప్రయత్నించినట్లు చెప్పడంతో పోలీసులు సైతం అవాక్కయ్యారు. అయితే ఎక్కడాకూడా మునిరాజుపై దాడులకు పాల్పడనప్పటికీ హత్యకు అనువైన స్థితి లభించలేదని అంగీకరించారు. దీంతో నిందితురాలిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణలో ఆమె తన భర్త హత్యకు కిరాయి వ్యక్తులతో పలుమార్లు ప్రయత్నించి మునిరాజు చెంతకు వెళ్ళలేక విఫలమైనట్లు అంగీకరించడంతో 6 మందిని అరెస్ట్‌చేసి మంగళవారం రాత్రి రిమాండ్‌కు తరలించారు. భర్తను భార్య చంపడం, చంపించడం, చంపించేందుకు ప్రయత్నించడమనేది సినిమాలను చూసి ప్రభావితం అవుతున్నారా, సమాజంలో జరుగుతున్న ఇటువంటి దుశ్చర్యలను సినిమాలలో పొందుపరుస్తున్నారా అనే చర్చ చంద్రగిరిలో జోరుగా సాగుతున్నది. నిందితుల అరెస్ట్ విషయంలో ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి, ఎస్ఐ అరుణ, సిబ్బంది మెరుగైన పనితీరును ప్రదర్శించినప్పటికీ ప్రజల మెప్పును పొందలేకపోయారు.

**-ఈ కేసు విషయం ఆద్యంతం ఉత్కంఠ**

చంద్రగిరి పోలీసులు ఈ అరెస్ట్‌పై పూర్తి స్థాయిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం, కనీసం ప్రెస్‌నోట్ అందించడంలో గానీ ఆసక్తి కనబరచలేదు. చంద్రగిరి సిఐ సురేష్‌కుమార్ బందోబస్తు వెళ్ళడంతో సమన్వయలోపం స్పష్టంగా కనిపించింది. పోలీసులు సమాచారం ఇవ్వడానికి ముందే చంద్రగిరిలో ఈ కేసు విషయం దావానంలా వ్యాపించడంతో పోలీసుల సమాచారం కోసం మీడియా మంగళవారం ఉదయం నుండి ఆతృతగా ఎదురు చూసినప్పటికీ వారి నుండి కనీస స్పందన లభించలేదు. రాత్రి సుమారు 7 గంటల వరకు సమాచారం అందకపోవడంతో పోలీసు అధికారులను పదేపదే ఫోన్ ద్వారా సంప్రదించగా కేవలం రెండు లైన్ల మెసేజ్‌తో సరిపెట్టిన వైనం ఆశ్చర్యం కలిగిస్తున్నది. కట్టుకున్న భార్యే మొగుడిని చంపేందుకు పథకం వేసిందనే విషయంలో గత వారం రోజులుగా జరుగుతున్న ప్రచారంపై ప్రజలకు కనీస అవగాహన కల్పించాల్సిన పోలీసులు నిందితులను రిమాండ్‌కు పంపడంలో బిజీగావున్నామని చెప్పడం ఆశ్చర్యం కలిగించింది.

